21న తణుకులో ప్రత్యేక లోక్ అదాలత్

4వ అదనపు జిల్లా జడ్జి సత్యవతి

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు కోర్టు పరిధిలో ఈ నెల 21వ తేదీ శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు 4వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్‌పర్సన్ డి.సత్యవతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న మోటార్ వాహన ప్రమాద కేసులు, భూ నష్టపరిహారం కేసులను కక్షిదారులు ప్రత్యేక లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు తమ తమ న్యాయవాదులను సంప్రదించి కేసుల నుంచి విముక్తి కావడానికి ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలని కోరారు.

విఏఎల 36 గంటల ధర్నా.. విజయవంతం

రాత్రీ.. పగలు, ఎండ.. మంచు, పురుగూ.. పుట్ర ఇవేమీ లెక్కజేయకుండా తమ సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు విరమించుకోవాలని యానిమేటర్లు, ఆర్‌పిలు కదంతొక్కారు. మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్, గ్రేడింగ్ పద్ధతి రద్దు చేయాలని, రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని, రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతోపాటు తదితర డిమాండ్లపై ఎపి వెలుగు విఏఎల (యానిమేటర్లు) సంఘం, ఎపి మెప్మా (ఆర్‌పి) ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో విఏఎలు, ఆర్‌పిలు భీమవరం కలెక్టరేట్ వద్ద చేపట్టిన 36 గంటల ధర్నా విజయవంతమైంది.

కలెక్టరేట్ ప్రాంగణంలో బైఠాయించిన విఏఎలు, ఆర్‌పిలు

- కలెక్టరేట్ వరకు ర్యాలీ, మండుటెండలో నిరసన
- డిఆర్‌డిఎ పీడీ వినతిపత్రం అందజేత
- పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్
- సమస్యల పట్ల ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదు
- విఏఎల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు నిర్మలాదేవి

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక తిరుమల విద్యాసంస్థలు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో మంగళవారం చేపట్టిన ధర్నాకు విఏఎలు, ఆర్‌పిలు వందలాదిగా తరలొచ్చారు. అక్కడే బైఠాయించి, నిరసన తెలిపి, వంటావార్పు చేసి రాత్రి అక్కడే బస చేశారు. నిద్రించేందుకు అసౌకర్యంగా ఉన్నప్పటికీ అవేమీ లెక్క చేయకుండా తమ సమస్యలే ప్రధాన ఎజెండాగా నిలబడ్డారు. బుధవారం ఉదయానే ధర్నా చేపట్టి నిరసన కొనసాగించారు. అక్కడ నుంచి విఏఎల సంఘం నేతలు, మెప్మా ఉద్యోగ సంఘం నేతలు, సిఐటియు నేతలు, ఆర్‌పిలు, విఏఎలు ర్యాలీగా కలెక్టరేట్‌కు బయల్దేరారు. ఈ నేపథ్యంలో అప్పటికే ఆ ప్రాంతంలో మోహరించిన పోలీసులు బారికేడ్లు అడ్డుపెట్టి వారిని అడ్డుకున్నారు. తమ సమస్యలు జిల్లా అధికారులకు చెప్పుకునేందుకు కలెక్టరేట్ వరకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అయితే కొంతమంది మాత్రమే వెళ్లండని భీమవరం టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్ చెప్పారు. దీనికి అంగీకరించని వారు తామంతా శాంతియుతంగా వెళ్లి వినతిపత్రం అధికారులకు సమర్పిస్తామని స్పష్టం చేశారు. దీనిపై సిఐ శ్రీనివాస్‌తో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా నాయకులు బి.వాసుదేవరావు మాట్లాడారు. అక్కడి నుంచి ర్యాలీ కొంతదూరం వెళ్లాక మరోసారి పోలీసులు అడ్డుకున్నారు. మళ్లీ నేతలు పోలీసులకు నచ్చజెప్పి కలెక్టరేట్ ప్రాంగణం వరకు పోలీసు పహారా మధ్య ర్యాలీ సాగించారు. అనంతరం కలెక్టరేట్ ఎదురుగా బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూనే ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై నినాదాలు చేశారు. మండుటెండలో బైఠాయించి చీరకొంగులు తలపై వేసుకుని చెమటలు కక్కుతూ కలెక్టర్, జిల్లా అధికారులు బయటకు రావాలని చేసిన నినాదాలతో కలెక్టరేట్ హోరెత్తింది. డిఆర్‌డిఎ పీడీ వేణుగోపాల్ వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారామ్మోహన్‌రాయ్, వెలుగు విఏఎల సంఘం జిల్లా అధ్యక్షులు నిర్మలాదేవి వేణుగోపాల్‌కు సమస్యలు వివరించారు. అనంతరం విఏఎలు, ఆర్‌పిల సంఘాల నేతలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పీడీ వేణుగోపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ విఏఎలను, ఆర్‌పిలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించమని సీసీలు, ఎపిఎంలకు చెప్పామన్నారు. జీతాలు అందని విషయం తన దృష్టిలో ఉందని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తానని తెలిపారు. మండల, గ్రామ సమాఖ్యలతో మాట్లాడి గుర్తింపు కార్డులు, యూనిఫారం ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో జాయింట్ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళ జిల్లా నాయకురాలు డి.కళ్యాణి, సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, విఏఎల సంఘం నాయకులు గోవిందమ్మ, ఝాన్సీ, తోట పద్మావతి, సోనీ, ధనలక్ష్మి, వాకలపూడి రత్నం, పద్మకుమారి పాల్గొన్నారు.

ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు, సిఐతో మాట్లాడుతున్న రాయ్

డిఆర్‌డిఎ పీడీకి వినతిపత్రం అందజేస్తున్న నేతలు, యానిమేటర్లు

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్

ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా ఒరిగిందేమీ ఉండదని, వారి సొంత ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు తప్ప సమస్యలు పట్టవని, పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. రెండు రోజులపాటు విఏఎలు చేపట్టిన ధర్నానుద్దేశించి రాయ్ మాట్లాడారు. విఏఎలు, ఆర్‌ఫిలు రకరకాల పని ఒత్తిళ్లతో అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. జాబ్‌చార్ట్ ప్రకారం కాకుండా అన్ని రకాల పనులు చెప్పి ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. వీరి సమస్యల పట్ల ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. 1996లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టారని, అయితే అమలు జరగలేదని అన్నారు. అయితే మోడీ మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని, ఈ బిల్లు 2029 వరకు అమల్లోకి రాదని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. 1926లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఏడుగురు సభ్యులుంటే సంఘం పెట్టుకోవచ్చని చట్టం చేసిందన్నారు. అయితే బిజెపి ప్రభుత్వం మాత్రం నూటికి పదిమంది ఉంటేనే సంఘం పెట్టుకోవాలని సంఘాలను విచ్ఛిన్నం చేస్తుందని మండిపడ్డారు. మహిళలంతా రాత్రీ పగలు ఇక్కడ కూర్చుని ఆందోళన చేస్తుంటే ఒక్క ప్రజాప్రతినిధిగానీ, జిల్లా అధికారులుగానీ స్పందించకపోవడం అత్యంత దారుణమన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు.

సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదు

విఏఎల సంఘం జిల్లా అధ్యక్షురాలు నిర్మలాదేవి

ఆర్‌పిలు, విఏఎలు ఎన్నోఏళ్ల నుంచి అనేక సమస్యల మధ్య సతమతమవుతున్నా, ఆ సమస్యలు పరిష్కరించడంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని విఏఎల సంఘం జిల్లా అధ్యక్షురాలు నిర్మలాదేవి విమర్శించారు. కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నానుద్దేశించి ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. మాట తప్పను.. మడమ తిప్పనని చెప్పిన జగన్ మోసం చేశారని విమర్శించారు. మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ తీసుకురావడం దుర్మార్గమన్నారు. కనీస ఉద్యోగ భద్రత లేదని, రూ. 10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రకరకాల పనులతో పని ఒత్తిడికి గురిచేసి అనారోగ్య సమస్యలకు ప్రభుత్వమే కారణమవుతుందని మండిపడ్డారు. గ్రేడింగ్ పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు దఫదఫాలుగా ఆందోళన సాగిస్తామని హెచ్చరించారు.

ప్రజాసంఘాల సంఘీభావం

విఏఎలు, ఆర్‌పిలు చేపట్టిన 36 గంటల ధర్నాకు సిపిఎంతోపాటు పలు ప్రజాసంఘాలు సంఘీభావం తెలిపాయి. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎస్.లారెన్స్‌కుమారి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎమ్‌డి.హసీనా, విఆర్‌ఎ, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.ఆంజనేయులు, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు బి.విజయకుమార్, పట్టణ పేదల సంక్షేమ సంఘం నాయకులు ఎం.వైకుంఠరావు ధర్నా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా ప్రభుత్వ కార్యక్రమాలకు జనాన్ని తరలించే విఏఎల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. విఏఎలతోపాటు అన్ని రంగాల స్కీమ్ వర్కర్లు, ప్రభుత్వ ఉద్యోగులు పెద్దఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

పని సర్దుబాటు చర్యలు చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని సచివాలయాల్లో విధులను సరళంగా నిర్వహించేందుకు అనుగుణంగా పని సర్దుబాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ సచివాలయ సిబ్బంది రేషన్‌లైజేషన్‌పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని మండలాల్లోని సచివాలయాల్లోని సిబ్బంది ఇటీవల జరిగిన బదిలీల కారణంగా తగ్గడం జరిగిందన్నారు. సంబంధిత సచివాలయాలను గుర్తించి విధులు సరళంగా నిర్వహించేందుకు అనుగుణంగా సచివాలయం నుంచి పని సర్దుబాటు కింద అవసరమైన ఉద్యోగులను తాత్కాలికంగా కేటాయించాలన్నారు. ఈ విషయమై సంబంధిత శాఖల అధికారులు జాబితాలను సిద్ధం చేసుకుని, సిబ్బంది కేటాయింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శోభారాణి, ఇన్‌ఛార్జి డిఎల్‌డిఓ కె.వాణి పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ పద్మశ్రీ ప్రసాద్

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాద్

ప్రజాశక్తి - భీమవరం

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, విద్యా శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి మరింత అభివృద్ధి చేయాలని జెడ్‌పి ఛైర్మన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాద్ జిల్లా విద్యా శాఖ ఉన్నత అధికారులతో బుధవారం సమీక్షించారు. జిల్లాలో నాడు - నేడు పనుల పురోగతి, 2023-24లో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత పెంపుదలకు తీసుకోవాల్సిన చర్యలు, విద్యార్థుల డ్రాపవుట్లు, మధ్యాహ్న భోజనం, పాఠశాలలో పారిశుధ్యం, బాలికలకు శానిటరీ నాప్కిన్స్ పంపిణీ, ఐరన్ లోపం గల విద్యార్థులకు ఐరన్ మాత్రల పంపిణీ, జిఇఆర్ సర్వే వంద శాతం పూర్తి చేయడం తదితర వాటిపై సమీక్షించారు. తరగతిలో వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఉపాధ్యాయులు వారిని దత్తత తీసుకొని ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. విద్యాశాఖాధికారులు, నాడు - నేడు ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతివ్వాలి

కాపుసేన రాష్ట్ర వ్యవస్థాపకులు హరిరామ జోగయ్య

ప్రజాశక్తి - పాలకొల్లు

సామాన్య, మధ్యతరగతి ప్రజలు అభివృద్ధి, సంక్షేమంలో వాస్తవంగా ఏం కోరుకుంటున్నారో వాటిని రాబోయే జనసేన, టిడిపిలు ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చాలని కాపుసేన రాష్ట్ర వ్యవస్థాపకులు చేగొండి హరిరామ జోగయ్య చెప్పారు. పాలకొల్లులో ఆయన నివాసంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. సాధ్యమైనంత వరకూ ఉచితాలు కాకుండా విద్య, ఉపాధి పొందేలా, రాష్ట్ర ఆదాయ వనరులు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలకు విడిగా డబ్బు వేసేకంటే వివాహ సమయంలో రూ.5 లక్షల కట్నం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బిసి రిజర్వేషన్ 24 నుంచి కనీసం 30 శాతానికి పెంచాలని, కాపులకు ఇతర కులస్తులకు ఇబ్బంది లేకుండా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ మేరకు తాము సలహాలు ఇస్తున్నామని, ఈ నెలాఖరు వరకూ వివిధ కులాల ప్రజల నుంచి అభిప్రాయాలు కోరుతున్నామని తెలిపారు. వీటిని 18 మంది స్క్రీన్ కమిటీ పరిశీలించి పవన్ కళ్యాణ్‌కు అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో తెల్లరేషన్ కార్డు ఉన్న వారందరికీ కెజి నుంచి పీజీ వరకూ ఉచిత విద్య, వైద్యం అందించాలని కోరారు. పేదలకు ప్రభుత్వం ఇళ్లునిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కాపు సేన నేతలు బి.చినబాబు, చేగొండి సూర్యప్రకాష్ మాట్లాడారు.

16 నుంచి ఇవిఎంల పరిశీలన

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 16వ తేదీ నుంచి ఇవిఎంలను మొదటి దఫా పరిశీలించనున్నామని, ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బందితో ఇవిఎంల పరిశీలనపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇఎంల పరిశీలన ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ జరుగుతుందని, జాతీయ, రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పక్షాలు వారి ప్రతినిధులను నామినేట్ చేయాలని తెలిపారు. ఎఫ్‌ఎల్‌సి కోసం ఎన్నికల కమిషన్ నిర్దేశిత లేఅవుట్‌ను డిజైన్ చేసిందని, దాని ప్రకారంగానే జరుగుతుందని తెలిపారు. ఇవిఎంలకు ఎటువంటి డేమేజ్‌లు జరిగాయా, మరమ్మతులున్నాయా, ఓటింగ్ సరిగ్గా పడుతుందా, యంత్రాలన్నీ కచ్చితంగా పని చేస్తున్నాయా లేదా తదితర అంశాలను తనిఖీ చేసి సీల్ వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియలో పొలిటికల్ పార్టీల ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని కోరారు. పార్టీల ప్రతినిధులు ఐడి కార్డులతో హాజరు కావాలని, వారు హాజరయ్యే సమయాన్ని లాగ్ బుక్‌లో నమోదు చేస్తారని తెలిపారు. తనిఖీ చేసిన ఇవిఎంలనే వచ్చే ఎన్నికలకు వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ కె.కృష్ణవేణి, ఆర్‌డిఓ దాసి రాజు, జిల్లా ఆర్‌అండ్‌బి అధికారి బి.లోకేశ్వరరావు, జిల్లా అగ్నిమాపక అధికారి బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

నియోజకవర్గంలో ప్రతి మారుమూల ప్రాంతంలోనూ తాగునీటి ఇబ్బందులేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. బుధవారం శేరేపాలెం పంచాయతీలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించి అనంతరం ఉన్నత పాఠశాలలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తాగునీటి ఇబ్బందిగా ఉండే శేరేపాలెంలో ఒహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మాణానికి మొగల్తూరు సిబిడబ్ల్యు ప్రాజెక్టు నుంచి ప్రత్యేక పైప్లైన్ నిర్మాణాలకు జలజీవన్ మిషన్ నుండి రెండో విడతలో రూ.6 లక్షలు కేటాయించామన్నారు. గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అదే గ్రామంలో ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గ్రామంలోని 1100 కుటుంబాల్లో 600 మందికి ఈ శిబిరంలో వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తణుకులు మునేశ్వరరావు, జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, కాగిత సత్యవాణి పాల్గొన్నారు.

రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చీఫ్‌విప్ ప్రసాద్‌రాజు

సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

జిల్లా పంచాయతీ శాఖ అధికారి మల్లికార్జునరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

విచ్చలవిడిగా పెరుగుతున్న రసాయనిక ఎరువుల వాడకాన్ని నియంత్రించేందుకు సేంద్రియ వ్యవసాయంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు అన్నారు. జిల్లాలోనే మొట్టమొదటి సారిగా గొరగనమూడి గ్రామ పంచాయతీలోని రైతు భరోసా కేంద్రంలో ఆర్గానిక్ వర్మీ కంపోస్ట్ ఎరువులను తయారు చేసే విక్రయ కేంద్రాన్ని డిపిఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1960 ప్రాంతంలో ఆహార కొరతను అధిగమించేందుకు ఆధునిక వ్యవసాయ విప్లవాన్ని అభివృద్ధి చేసేందుకు శాస్త్రవేత్తలు ఎంతగానో కృషి చేశారన్నారు. సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీరాజు) మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులు విచ్చలవిడిగా వాడడం వల్ల భూములు సారవంతాన్ని కోల్పోయాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మురళీ గంగాధరరావు, గ్రామ సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామ రాజు, ఉపసర్పంచి గూడూరు ఆంజనేయులు, డిపిఆర్‌సి కో ఆర్డినేటర్ ఎడ్వర్డ్ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగు నీరందించడమే లక్ష్యం

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - ఉండి

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. బుధవారం మండలంలోని కోలమూరు గ్రామంలో జల జీవన్ మిషన్ ద్వారా రూ.47 లక్షలతో నిర్మిస్తున్న పైప్‌లైన్, ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే కాకుండా మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా చూస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ముఖ్యమంత్రి జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నడింపల్లి సత్యవతి రామకృష్ణరాజు, ఎంపిటిసి పేరిచర్ల అరుణ భార్గవి, గ్రామ అధ్యక్షుడు పేరిచర్ల కేశవరాజు, వైసిపి నాయకులు గండ్రాజు రాజేష్ వర్మ, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న పివిఎల్

'ఉపాధి హామీ'ని పరిరక్షించాలని నిరసన

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించి, పని దినాలు, వేతనాలు పెంచాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం దేశవ్యాప్త పిలుపులో భాగంగా వ్యకాస ఆధ్వర్యంలో దువ్వ గ్రామ సచివాలయ కార్యదర్శి ఎస్‌వివి.నరసింహమూర్తికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ దశాబ్దాల తరబడి ఎర్రజెండా నాయకత్వంలో వామపక్షాలు చేసిన పోరాటాల ఫలితంగా ఉపాధి హామీ చట్టం వచ్చిందన్నారు. ఈ చట్టం వచ్చాక గ్రామీణ ప్రాంత పేదలకు పని గ్యారంటీ భరోసా కల్పిస్తూ కూలీల జీవన ప్రమాణాల మెరుగుదలకు కొంతమేర దోహదపడిందని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నేడు బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోందని విమర్శించారు. తక్షణం కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, పెండింగ్ బకాయి వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దొంగల నాగేశ్వరరావు, సభ్యులు బండారు వెంకటేశ్వరరావు, నీలం వెంకట బసవయ్య, ఆలం ధనరాజు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

యలమంచిలి :ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏనుగువానిలంక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉపాధి కూలీలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మాసవరపు సుబ్బారావు, యడ్ల మోహనరావు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం ద్వారా బ్యాంకు అకౌంట్లకు, ఫోన్ నంబర్లకు ఆధార్ లింక్ చేయడంతో కూలీలు పనిచేసినా వారి వేతనాలు వారు అందుకునే పరిస్థితి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల నాయకులు కానేటి బాలరాజు, ఉపాధి కూలీలు కొండపల్లి రామకృష్ణ, యు.శ్యామల పాల్గొన్నారు.

40,032 గృహ నిర్మాణాలు పూర్తి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లావ్యాప్తంగా జగనన్న లే అవుట్లలో 40,032 వేల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయని, వాటిలో తొలివిడతగా 298 గృహ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా 30 లక్షల ఇళ్లు మంజూరు కాగా, నిర్మాణాలు పూర్తయిన ఐదు లక్షల ఇళ్లను కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి సిఎం జగన్ గురువారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారని తెలిపారు. తణుకు మండలం దువ్వ జగనన్న లే అవుట్ నుంచి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. జిల్లాలో 92,843 ఇళ్లు మంజూరు కాగా 40,032 ఇళ్లు పూర్తయ్యాయని, 52,811 వేల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయని తెలిపారు. తణుకు మండలం దువ్వ లేఅవుట్‌లో 682 ఇళ్లు మంజూరు కాగా, 298 గృహ ప్రవేశాలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రారంభానికి సిద్ధమైన 40,032 ఇళ్లను అన్ని నియోజకవర్గాల్లో త్వరలో గృహ ప్రవేశాలు చేయనున్నట్లు తెలిపారు.

స్వామినాథన్‌కు నివాళి

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో భారత హరిత విప్లవ పితామహుడు ఎంఎస్.స్వామినాథన్‌కి ఘనంగా నివాళలర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షత వహించి మాట్లాడారు. స్వామినాథన్ వ్యవసాయ రంగానికి, దేశ ఆహార భద్రతకు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన భావాలను అర్థం చేసుకుని కాలానికి అనుగుణంగా మార్పులు తీసుకురావడానికి ఈ తరం కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు స్వామినాథన్‌పై పవర్ పాయింట్ ప్రజెంట్ చేశారు. లెక్చరర్లు కె.స్వరూపరాణి, సిహెచ్.చైతన్య, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

విద్యార్థులు ప్రతిరోజు తగిన పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని పెనుమంట్ర సిడిపిఒ కృష్ణకుమారి అన్నారు. బుధవారం అంతర్జాతీయ కిశోర బాలికల దినోత్సవ సందర్భంగా మండలంలోని ఆచంట వేమవరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బాలికలు కొవ్వొత్తులతో అభివాదం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణకుమారి మాట్లాడారు. కిశోర బాలికలు పౌష్టికాహారంతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురి కాకుండా ఉంటారన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న బాలామృతంతో వివిధ రకాల వంటలు తయారుచేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యవతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్యామలారాణి పాల్గొన్నారు.

బొండాడలో ప్రజా సంకల్ప యాత్ర

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజలకు అత్యంత చేరువవ్వడమే ప్రజా సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని బొండాడలో ప్రజా సంకల్ప యాత్రను డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో రూ.12.60 కోట్లతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయినేజీలు, రూ.2.40 కోట్లతో పైపులైన్ విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శిరిష విశ్వనాథరాజు, జెడ్‌పిటిసి సభ్యులు సోమేశ్వరరావు, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు, వైసిపి మండల కన్వీనర్ గణేష్ రాంబాబు పాల్గొన్నారు. అనంతరం సీసలి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పివిఎల్ ప్రారంభించారు.

15 నుంచి అందుబాటులో గోనెసంచులు

ప్రజాశక్తి - గణపవరం

ఈ నెల 15వ తేదీ నుంచి రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు గోనె సంచులు అందుబాటులో ఉంటాయని ఎడిఎ పి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని అప్పన్నపేటలో బుధవారం నిర్వహించిన వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాలుగైదు రకాల పురుగుమందులు, రెండు మూడు రకాల తెగుళ్ల మందులు కలిపి పిచికారీ చేస్తే మందుల బలం తగ్గిపోతుందని చెప్పారు. ఎఒ ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచ్ నక్కా సూరిబాబు, ఎంపిటిసి సభ్యులు కొల్లి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

జనసేనతోనే ప్రతి కుటుంబానికీ న్యాయం : బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జనసేన అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి కుటుంబానికి న్యాయం జరుగుతుందని జనసేన పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ కన్వీనర్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఆరుగొలను గ్రామంలో బుధవారం పలె పోరు కార్యక్రమం నిర్వహించారు. వైసిపికి చెందిన 50 మంది శ్రీనివాస్, రాజేష్ నాయకత్వంలో జనసేన పార్టీలో చేరారు. అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న దుర్మార్గపు పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం రూరల్ : బహుమతులు అందిస్తున్న కలెక్టర్

స్థానిక శ్రీ పొట్టిశ్రీరాములు పురపాలక సంఘం ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ ప్రశాంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు కలిసికట్టుగా ఐకమత్యంగా ఏ సమస్య వచ్చినా తమ గళాన్ని వినిపించాలన్నారు. ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. వివిధ పోటీల్లో గెలుపొందిన బాలికలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖాధికారి బి.సుజాతారాణి, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ, తహశీల్దార్ వై.రవికుమార్, హెల్త్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జి.సుగుణరాజు, ప్రధానోపాధ్యాయులు జె.సుధారాణి, ఐసిడిఎస్ ఇఒ సిహెచ్.సుజాతాలక్ష్మి, ఉపాధ్యాయులు, ఐసిడియస్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆడపిల్ల ఇంటికి కళ అని జిటిపి మహిళ కళాశాల బిఇడి ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ధనలక్ష్మి అన్నారు. భీమవరం జిటిపి మహిళ కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇడి ప్రిన్సిపల్ పి.జొహన్నా, శ్రీభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఉపాధ్యాయులు వి.పద్మ, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం బాలికలతో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఉషా, ఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు. భీమవరం బ్రౌనింగ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్రౌనింగ్ కాలేజీ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, యుపిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రఫీ, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ వివిఎస్ఆర్‌కె.కుమారి, హెచ్‌వి.లలితకుమారి, జయలక్ష్మి, పట్టణ ఆరోగ్య కేంద్రాల ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలల అంతర్జాతీయ బాలిక దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆరోగ్య వర్షిని వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామంలో బాలికల హక్కులను తెలియజేస్తూ ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ చక్రవర్తి, గుడాల తాతారావు, బొక్క కోటేశ్వరి, కొల్లాటి వెంకటేశ్వరమ్మ, చింత దుర్గ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు పట్టణ పరిధిలోని జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ న్యాయవాది కర్ర జయసరిత విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ సాయి, హెచ్‌ఎం భవానీప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాళ్ల : ఏలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత అంశాలపై బాలికలకు వివరించారు. ఉపాధ్యాయుడు కట్టా వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకోడేరు : శృంగవృక్షంలో నిర్వహించిన సభలో సర్పంచి జంగం సూరిబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సభలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పార్వతి, ఉప సర్పంచి కలిదిండి ఆనందరాజు, వార్డు మెంబర్ సోము దుర్గాభవాని, ఎంపిడిఒ నూకల మురళీగంగాధరరావు, పంచాయతీ కార్యదర్శి దొంగ సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శి లక్ష్మీదేవి, దిలీప్, విఆర్ఒ భోగేశ్వరరావు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పెనుమంట్ర : బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని ఐసిడిఎస్ సిడిపిఒ ఎ.కృష్ణకుమారి అన్నారు. బాలికల దినోత్సవం సందర్భంగా పెనుమంట్ర హైస్కూల్ విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను గురించి అంగన్‌వాడీల ఆధ్వర్యంలో వివరించారు.

హెచ్‌ఐవి బాధిత చిన్నారులకు పోషకాహారం

ప్రజాశక్తి - తణుకు రూరల్

హెచ్‌ఐవి బాధిత చిన్నారులకు ఉచితంగా పోషకాహారం, నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమని తణుకు ఎఆర్‌టి సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పి.రాజరాజేశ్వరి అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని ఎఆర్‌టి సెంటర్‌లో బాధిత చిన్నారులకు పారిశ్రామికవేత్త మల్లిన రామచంద్రరావు సౌజన్యంతో బుధవారం పోషకాహారం అందించారు. ఈ సందర్భంగా ఎఆర్‌టి సెంటర్ వైద్యాధికారి సుంకవల్లి రామకృష్ణ మాట్లాడుతూ మల్లిన రామచంద్రరావు సంవత్సరకాలంగా ప్రతి నెలా ఈ పోషకాహారంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారని, ఈ సందర్భంగా రామచంద్రరావు సేవలను కొనియాడారు.

ఏలూరు జిల్లాకు చెందిన ఎం.మణెమ్మ గతేడాది సెప్టెంబర్‌లో ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లింది. డిసెంబరులో ఆమెకు టిబి సోకినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ ఇండియా ఎంబసి ద్వారా ఈ నెల 3వ తేదీన మణెమ్మకు తోడుగా ఒక నర్స్‌ను పంపారు. స్వదేశానికి తిరిగి వచ్చిన ఆమెకు ఎవరూ లేరని తెలుసుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహిళను తణుకు నుంచి డాక్టర్ రామకృష్ణ హైదరాబాద్ వెళ్లి వారిని రిసీవ్ చేసుకుని వైద్య సేవలందిస్తూ మాచవరంలోని సెంట్ ఆన్స్ లోయోలా ప్రేమ నివాసం హాస్టల్‌లో చేర్చారు. ఈ సందర్భంగా సెంటర్ వైద్యాధికారి సుంకవల్లి రామకృష్ణను ఆ విభాగ ఉద్యోగుల ఆధ్వర్యంలో జిల్లా ఐసిటిసి సూపర్‌వైజర్ ఎ.హరనాథ్, షేర్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ జి.జగదీష్ ఘనంగా సత్కరించారు.

హెచ్‌ఐవి చిన్నారులకు పోషకాహారం అందిస్తున్న వక్తలు

విద్యార్థులు స్టాంపులు, నాణాల సేకరణ అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్టాంపులు, నాణాలు సేకరించడం విద్యార్థి దశ నుంచే అలవర్చుకుంటే పరిజ్ఞానం పెరుగుతుందని, బ్రిటిష్ కాలంలోనే తొలి తపాల స్టాంపు విడుదలైందని భీమవరం పోస్టల్ శాఖ సీనియర్ సూపరింటెండెంట్ పి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. భీమవరం పోస్టల్ శాఖ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్టాంపులు, నాణాల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆయా దేశాల్లో ప్రముఖుల పేరిట స్టాంపులు ముద్రించి విడుదల చేసి వారి గౌరవలను భావితరాలకు తెలియజేసేలా కృషి జరుగుతుందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెడ్ పోస్ట్ మాస్టర్ ఎస్ఎన్.ఆచార్యులు, జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, పోస్టల్ అసిస్టెంట్ అల్లు సురేష్, యూనియన్ నాయకులు లెనిన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు వైసిపికే ఉంది : పివిఎల్

ఉండి :రాష్ట్ర ప్రజలను ఓటు వేయమని అడిగే హక్కు ఒక్క వైసిపికే ఉందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని పాందువ్వ గ్రామంలో బుధవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల్లో మేనిఫెస్టోను నూటికి 98 శాతం నెరవేర్చిన అధికార పార్టీకే ప్రజలను ఓటు అడిగే హక్కు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, నాయకులు వెంకటేశ్వరరావు, వెంకటాచార్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రెయిన్లకు నిధులు మంజూరు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతి మండలంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు రూ.60 లక్షల నిధులు ఉపాధి హామీ చట్టం మంజూరు చేసినట్లు డ్వామా ప్రాజెక్టు మేనేజర్ (పీడీ) ఎస్‌టివి.రాజేశ్వరావు అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో తణుకు క్లస్టర్ పరిధిలోని పెనుమంట్ర, అత్తిలి, గణపవరం, తాడేపల్లిగూడెం, పెంటపాడుకు చెందిన ఎన్ఆర్ఇజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎపిఒ, ఇసి, టిఎ, బిఎఫ్‌టిలకు 2023 - 24 సంబంధించి పనుల గుర్తింపు, ప్రణాళిక ప్రక్రియ, లేబర్ బడ్జెట్ తయారీపై బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ రాజేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ శ్రీకాంత్, ఎపిడి బి.వీరస్వామి, ఐదు మండలాల పరిధిలోని ఎపిఒ, ఇసి, టిఎ, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

20న అంబేద్కర్ పాలరాతి మందిర ప్రతిష్ట

భీమవరం రూరల్ :డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పాలరాతి మందిర ప్రతిష్ట మహోత్సవాన్ని ఈ నెల 20వ తేదీన ఉండవల్లి రాజగృహ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ దుంగా రత్నప్రదీప్ తెలిపారు. భీమవరం హోటల్ ప్రాణామ్స్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత కెసి.రాజు రచించిన 80 వసంతాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రత్నప్రదీప్ మాట్లాడుతూ అంబేద్కర్ మనవడు భీమ్ రావ్ యశ్వంత్ అంబేద్కర్‌చే పాలరాతి మందిర ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన భీమవరం డిఎన్ఆర్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బి.జ్యోతిరాజేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి శ్రీకర్, కెసి.రాజు, శ్యామ్‌సుందర్, రాజేష్, ఎన్.భాస్కరరావు, యాళ్ల హనూక్ వర్ధన్, పాలపర్తి జోనా, వీరవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - ఆచంట

చంద్రబాబు అరెస్టుపై నిరసనగా ఆచంటలో టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారంతో 29వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు మాజీ మంత్రి పితాని సత్యనారాయణ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్రరాజు నాగేశ్వరరావు, సత్యనారాయణ, బొక్క సూర్యనారాయణ, బొంతు కాశీవిశ్వనాథం, కోళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్ వద్ద ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం 29వ రోజుకు చేరాయి. శిబిరంలో పాల్గొన్న తెలుగు యువత సభ్యులు సంతకాలు చేసి, రక్తంతో వేలిముద్రలు వేశారు.

మొగల్తూరు : ముత్యాలపల్లిలో టిడిపి నేతలు జాతీయ రహదారిని చీపుర్లతో శుభ్రంచేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగిడి రాంబాబు, బందన నరసింహ, కొల్లాటి బాలకృష్ణ, బుల్లబ్బాయి, సాయిబాబు, జనకరాజు, తులసీరామారావు, మూలస్వామి పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య సురక్షతో కార్పొరేట్ వైద్యం : పివిఎల్


పాలకోడేరులో...

ప్రజాశక్తి - పాలకోడేరు

నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరసింహరాజు అన్నారు. మండలంలోని శృంగవృక్షం గ్రామంలోని సచివాలయం-2 పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పివిఎల్‌కు సర్పంచి జంగం సూరిబాబు, వైసిపి ముఖ్యనేత కలిదిండి కృష్ణంరాజు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ ప్రధానంగా బిపి, షుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. సర్పంచి జంగం సూరిబాబు నాయకులు కలిదిండి కృష్ణంరాజు, ఉప సర్పంచి కలిదిండి ఆనందరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వరరావు, కటిక శ్రీదేవి, పేరిచర్ల కనకరాజు, బుంగా రమణబాబు, గునుపూడి రంగారావు, సోడదాసి నరేష్, మల్లుల సూర్యకళ, సొసైటీ అధ్యక్షులు వీరవల్లి లక్ష్మణరావు, పెన్మత్స శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

వీరవాసరం : ప్రతిఒక్కరూ ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తోలేరు గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వేండ్ర లీలాకృష్ణ, ఉప సర్పంచి భోగిరెడ్డి శ్రీనివాసరావు, మాజీ సర్పంచి చవాకుల సత్యనారాయణ, భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, వైసిపి మండల కన్వీనర్ కడలి ధర్మారావు, అండలూరు సహకార సంఘం ఛైర్మన్ మానుకొండ ప్రదీప్‌కుమార్, ఎఎంసి డైరెక్టర్ పొలమూరి బుల్‌రాజు, తహశీల్దార్ సుందరరాజు, ఎంపిడిఒ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, వైసిపి నాయకులు నాగరాజు శ్రీనివాసరాజు, పోలిశెట్టి సత్యనారాయణ, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

పెనుమంట్ర :జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాజమండ్రి రుడా ఛైర్మన్, నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. మండలంలోని మల్లిపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దొంగ మహాలక్ష్మి, ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసు రెడ్డి), ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), ఎంపిడిఒ పి.పద్మజ, ఎంఇఒ ఉంగరాల నాగేశ్వ రరావు, ఇఒపిఆర్‌డి రాంప్రసాద్, వైసిపి నాయకులు, కార్యక ర్తలు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట :పేదలకు మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని వైసిపి నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. మండలంలోని ఆచంట వేమవరం గ్రామంలో సర్పంచి జక్కంశెట్టి చంటి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో షర్మిలారెడ్డి పాల్గొని మాట్లాడారు. రోగాలను ఆదిలోనే గుర్తించి వైద్యాన్ని చేయించుకునే వెసులుబాటు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, ఉప సర్పంచి కొండేటి బాబు, నేతలు అందే నాగబసవన్న, సుంకర సీతారాం, భవాని, తాతబ్బాయి, వీరభద్రం పాల్గొన్నారు.

ఆచంటలో...

పెనుమంట్ర : మండలంలోని మల్లిపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జుత్తిగ హైస్కూల్ విద్యార్థుల సేవలు పట్ల అధికారులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి జుత్తిగ హైస్కూల్ నుంచి 6,7,8 తరగతులను మహాత్మ గాంధీ స్కౌట్ టీంగా విద్యార్థులను సేవా కార్యక్రమాలకు నియమించారు. ఈ విద్యార్థులు ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో వచ్చినవారికి బటర్‌మిల్క్ వంటి పానీయాలు ఇచ్చారు. ఒపి పేర్లు నమోదులో సహకరించారు. వృద్ధులకు దగ్గరుండి ఆరోగ్య పరీక్షలు చేయించి పంపించారు. ఈ విద్యార్థులకు టీం లీడర్ జుత్తిగ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు వై.జాన్ కెనడీ సలహాలు సూచనలు ఇచ్చారు.

గణపవరం : ఆరోగ్యం విషయంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని గణపవరం ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి అన్నారు. మండలంలోని ఎ.గోపవరంలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచి పాతంశెట్టి పద్మావతి శ్రీనివాస్ ప్రారంభించారు. శిబిరంలో బిపి, షుగర్, ఇతర వ్యాధులకు మందులు అందించారు. 1030 మందికి వైద్యసేవలందించారు. కంటి వెలుగులో భాగంగా 102 మందికి కంటి పరీక్షలు చేశారు. ఆరుగురు వృద్ధులకు కళ్లజోళ్లను జెడ్‌పిటిసి సభ్యులు దేవవరపు సోమలక్ష్మి పుప్పాల పుండరికాక్షుడు, దండు రాము అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కె.కిరణ్మయి, కె.ప్రియాంక, దివ్యారెడ్డి, ఇ.శ్వేతారెడ్డి, తహశీల్దార్ పి.లక్ష్మి, సిహెచ్ఒ జాలాది విల్సన్‌బాబు పాల్గొన్నారు.

ఉండి : మండలంలోని పాములపర్రులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజారోగ్యం పట్ల శ్రద్ధ చూపుతూ రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కేసన శాంతికుమారి, బలుసులరావు, మాజీ సర్పంచులు నక్కా చెన్నకేశవరావు, తాటిపర్తి పెదవీరప్ప, పార్టీ గ్రామ అధ్యక్షులు వర్రే ముసలయ్య, పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ - జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఈ నెల 12వ తేదీ పిఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల బుధవారం తెలిపారు. పట్టణంలోని 19, 20, 21 వార్డుల ప్రజలు ఈ శిబిరంలో వైద్య సేవలు పొందాలని కోరారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

గణపవరం :భార్యను హత్య చేసిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అప్పన్నపేటలో ఈ నెల పదో తేదీన భార్యను పచ్చడిబండతో కొట్టి హత్య చేసిన తోట వెంకటేశ్వరావును తాడేపల్లిగూడెం రూరల్ ఎస్ఐ ఎస్ఎస్‌వి.మూర్తి ఆధ్వర్యంలో అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంటి తగాద విషయంలో వెంకటేశ్వరావు అతని భార్య రమాదేవిని హత్య చేసినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి తాడేపల్లిగూడెం కోర్టుకు పంపించినట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

తాడేపల్లిగూడెం : రైళ్లలో ప్రయాణిస్తున్న మహిళల మెడలో బంగారు వస్తువులు అపహరించిన వ్యక్తికి 14 రోజుల రిమాండ్ విధించారు. రైల్వే ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపిన వివరాల ప్రకారం... రైళ్లలో ప్రయాణిస్తున్న మహిళల మెడలో బంగారు వస్తువులు అపహరిస్తున్న ఉండి మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన ఇస్సాకును తాడేపల్లిగూడెం జిఆర్‌పి ఎస్ఐ జి.శ్రీహరిబాబు ఆర్‌పిఎఫ్ సిబ్బందితో కలిసి మంగళవారం నిడదవోలు ఔటర్ బసివిరెడ్డిపేట సమీపంలో అరెస్టు చేశారు. నిందితుడిని బుధవారం విజయవాడ ఎజెఎఫ్‌సి కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు.

కావలెను

ప్రజాశక్తి దినపత్రికకు దిగువ కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఏలూరు కల్చరల్, ఏలూరు సిటీ, భీమవరం టౌన్, తాడేపల్లిగూడెం టౌన్, నరసాపురం అర్బన్, తణుకు టౌన్, నూజివీడు టౌన్

రూరల్ : జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ఏలూరు, వేలేరుపాడు, కుక్కునూరు, కెఆర్.పురం ఐటిడిఎ, నరసాపురం, తాడేపల్లిగూడెం, కైకలూరు, దెందులూరు, పెదవేగి, పెదపాడు, నిడమర్రు, లింగపాలెం, అత్తిలి, ఇరగవరం, పెంటపాడు

విద్యార్హత: ఇంటర్

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

ఎడివిటి ఇన్‌ఛార్జి: నూజివీడు
మార్కెటింగ్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

ఇంటర్వ్యూ తేదీ:
14-10-23 శనివారం ఉదయం పది గంటలకు
ప్రదేశం: ప్రజాశక్తి కార్యాలయం, పవర్‌పేట, ఏలూరు

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్స్
సెల్: 9949366196, 8919170815, 9490099168

విష్ణులో ఘనంగా స్పార్క్ ట్యాంక్ - 2023 ఫైనల్స్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

బివి.రాజు ఫౌండేషన్, విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వారి విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బుధవారం స్పార్క్ ట్యాంక్ - 2023 ఫైనల్స్" కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ డాక్టర్ దశిక సూర్యనారాయణ తెలిపారు. విద్యార్థులు అన్ని శాఖల సహాయంతో ఇంటర్ డిసిప్లినరీ, ప్రాక్టికల్ లెర్నింగ్ ప్రాజెక్టులను చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఇన్నోవేషన్, ఎంట్రప్రెన్యూరిషిప్, డైరెక్టర్ డాక్టర్ ఎంకె.కౌశిక్ హాజరై మాట్లాడారు. విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహించిన స్పార్క్ ట్యాంక్-2023 బిజినెస్ క్లాస్ మోడల్ లాగా ఉందని తెలిపారు. అనంతరం విజేతలకు ట్రోఫీ, చెక్కులు పంపిణీ చేసారు. విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ వివిఎస్ఎన్.నరసింహరాజు మాట్లాడుతూ మొత్తం 120 జట్లు పాల్గొన్నాయని, అందులో తొమ్మిది జట్లు ఫైనల్‌లో నిలిచాయని చెప్పారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

15న మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 15వ తేదీన ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నిక భీమవరంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కృష్ణమోహన్ తెలిపారు. స్థానిక టౌన్ హాలులో జిల్లా నాయకులతో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో మున్సిపల్ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. తమ అసోసియేషన్ ఈ నెల 15వ తేదీన స్థానిక టౌన్ హాలులో నిర్వహించే రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నికకు రాష్ట్రంలో ఉన్న 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరవుతున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న 112 మున్సిపాలిటీల అధ్యక్ష, కార్యదర్శులు, 11 మున్సిపల్ కార్పొరేషన్ల అధ్యక్ష కార్యదర్శులు హాజరవుతున్నారన్నారు. వీరితోపాటు మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులు కూడా పాల్గొంటారని తెలిపారు. సభకు శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, స్థానిక ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు.

మత ఘర్షణలు సృష్టిస్తున్న బిజెపి

ప్రజాశక్తి - తణుకు రూరల్

బిజెపి మత ఘర్షణలు ద్వారా అధికారంలో ఉండాలని ప్రయత్నిస్తుందని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయని బిజెపిని ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.వి.ప్రతాప్ పిలుపునిచ్చారు. స్థానిక అమరవీరుల భవనంలో సిపిఎం రాజకీయ శిక్షణా తరగతులు సీనియర్ నాయకులు గార రంగారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇల్లింద్రపర్తి సత్యనారాయణ, వి.వెంకటేశ్వరరావు, శారద, గోవిందరాజు, శ్రీను, పాపారావు, దుర్గారావు, వి.శివన్నారాయణ, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

చినరంగనిపాలెంలో రచ్చబండ

భీమవరం రూరల్ :చంద్రబాబు అరెస్ట్‌పై టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో పట్టణంలోని చినరంగనిపాలెంలోని 6,7 వార్డుల ప్రజలతో బుధవారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. బొక్కవారి పాలెంలోని రామాలయంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్య రాజు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి బాబుతో నేను కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడారు.

డాక్యుమెంట్లు పోయినవి

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, తిమ్మయ్యపాలెం గ్రామానికి చెందిన కంచర్ల వీర వెంకట దుర్గాప్రసాద్, తండ్రి: నాగేశ్వరరావు అనే నేను గత నెలలో నా ఇంటి దస్తావేజులను ఫోటోస్టాట్ తీయించుకునేందుకు బైక్ మీద కైకరం వస్తుండగా మార్గ మధ్యలో ఎక్కడో జారిపోయాయి. **దస్తావేజు నెం. 632/2008** ల లింకు డాక్యుమెంట్లు మిస్ అయ్యాయి. కావున దస్తావేజులు దొరికినవారు ఈక్రింది చిరునామాకు అందజేయగలరని కోరుచున్నాము.

కంచర్ల వీర వెంకట దుర్గాప్రసాద్
తండ్రి: నాగేశ్వరరావు, కుమ్మరివీధి
తిమ్మయ్యపాలెం, ఉంగుటూరు మండలం
ఏలూరు జిల్లా - 534 406

In the Court of the Hon'ble Junior Civil Judge, Bhimadole, West Godavari District
E.P. No. 14/2020 in O.S. No. 305/2018

Between:
Sri Maradani Pavan Kumar ...D.Hr
AND
Sri Sydu Srikanth ...J.Dr
To:
పై నెంబరులో J.Dr. అయిన Sydu Srikanth, S/o. Nagaraju, D.No. 5-75, Prathikollalanka, Eluru Rural Mandal, West Godavari District అను మీకు చాలాసార్లు నోటీసులు కోర్టు నుండి అమలు నిమిత్తం పంపినప్పటికి అమలు కాలేదు. కావున సదరు కేసు ది. 10-11-2023 నాటికి వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజు మీరు ఉదయం గం॥ 10.00 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల పై కోర్టు వారు మీ పరోక్షమందు సదరు కేసు తీర్మానించెదరు. కావున మీకు తెలియపర్చడమైనది.
(ది. 10-10-2023వ తేదీ నాటి శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.వి.పి.మాధవరావు
అడ్వకేట్ & నోటరీ
అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు
ఏలూరు కోర్టు సెంటర్
స్థలం: ఏలూరు
తేది:12-10-23
సెల్: 9440111033

నోటీసు
మహారాజశ్రీ ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 201/2016

Between:
Teegavarapu Venkateswara Rao ...వాది
AND
Teegavarapu Venkata Subrahmanyam and Others 9 ...ప్రతివాదులు
TO: D-9: Eella Naga Laxmi, W/o. Durgaprasad, Hindu, Female, Age about 34 Years, House Wife, C/o. M.Peddintlamma, W/o. Late Rama Krishna, Raghavapuram Village & Post, Chintalapudi Mandal, CH.J.C.J.C.

పై తెల్పిన దావాలో మీకు నోటీసు అమలు నిమిత్తం ది.30-10-2023కు వాయిదా అయి ఉన్నది. సదరు దావాలో మీకు ఎట్టి ఆక్షేపణలు లేక అభ్యంతరములు ఉన్న ఎడల మీరు స్వయంగా లేక మీ తరపు ప్లీడరు గారి ద్వారా గాని **ది.30-10-2023న ఉదయం గం॥10:30 ని॥లకు హాజరై మీ సమాధానం తెల్పుకోగలరు.** అట్లు మీరు హాజరు కాని ఎడల సదరు శ్రీ కోర్టు వారు మీపై Exparty ఉత్తర్వులు జారీ చేసి మీ పరోక్షమున దావాను విచారించెదరని మీకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

M.P.RAMESWARA KUMAR
B.V.RAGHAVA SARMA
Advocate, Eluru.
Eluru,
06-10-23.
Cell: 98485 92285